సాక్షి ప్రకాశం

సోమవారం । 10 । జూన్ । 2024



బంగినపల్లికి భలే గిరాకీ

ఉలవపాడు మామిడికి ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. అందులోనూ బంగినపల్లి మామిడి గిరాకీ వేరే లెవల్ కావడంతో టన్ను రూ.లక్షపైనే పలుకుతోంది. - 2లో..



గమనించండి!

పొట్ట కూటి కోసం గనుల్లో పనిచేసే కార్మికులకు భద్రత కరువైంది. వారు తరచూ ప్రమాదాలకు గురై మృతిచెందుతున్నారు. రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - 2లో..

గరిష్టం/కనిష్టం
34/25

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ శ్రేణులు ధైర్యంగా ఉండాలి

- మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి





ఒంగోలు: వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి సూచించారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, మనోనిబ్బరాన్ని కలిగి ఉండాలని కోరారు. మీకు అండగా ఉండేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికే టీడీపీ దాడులపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు లీగల్ సెల్ కమిటీలను నియమించామని తెలిపారు. ఇటీవల జరుగుతున్న భౌతిక దాడులపై పోలీసుశాఖ దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్సార్ సీపీ వారు ఏ ఒక్కరూ మనోధైర్యాన్ని కోల్పోరాదని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన వారు రెచ్చగొట్టినా సంయమనంతో ఉండాలన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటిరోజే ఏపీఐఐసీ చైర్మన్ పదవికి తాను రాజీనామా చేస్తూ ఆ లేఖను ప్రభుత్వ కార్యదర్శికి పంపినట్లు జంకె తెలిపారు.

ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా



షంషేర్ అలీబేగ్

మార్కాపురం టౌన్: ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ ఆదివారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీకి పంపినట్లు మార్కాపురంలో ఆదివారం విలేకరులకు తెలిపారు. దీంతో పాటు మార్కాపురం అగ్రికల్చర్ మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి కూడా రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

విజ్ఞానం.. వినోదం..!

జీవ వైవిధ్యానికి జీవం పోస్తోంది..శ్రీశైలం బయోడైవర్సిటీ కేంద్రం. జీవరాశులపై ఎప్పటికప్పుడు సరికొత్త పరిశోధనలు, ప్రయోగాలు నిర్వహిస్తోంది. సీతాకోకచిలుకలు, మాత్‌లు, కీటకాలు, తూనీగలు, కందిరీగలు, తేనెటీగలు, బీటల్స్ ఎరాకిడ్స్ (స్పైడర్లు)పై పరిశోధనలు చేస్తూ కొత్తరకం జీవులను ల్యాబ్ ద్వారా పరిచయం చేస్తోంది. వెన్నెముక జీవులైన చేపలు, ఉభయచరాలు, సరీసృపాలు, పక్షులు, క్షీరదాలపై కూడా పరిశోధనలు చేస్తూ విజ్ఞానాన్ని పెంచడంతో పాటు వినోదాన్ని పంచుతోంది.

- శ్రీశైలం బయోడైవర్సిటీ కేంద్రంతో జీవ వైవిధ్యానికి జీవం
- జిల్లా సరిహద్దుకు 5 కిలోమీటర్లే దూరం
- ప్రసిద్ధిగాంచిన సందర్శనీయ క్షేత్రం
- ఎప్పటికప్పుడు కొత్తగా ప్రయోగం
- విద్యార్థులకు ఎంతో ఉపయోగం



భద్రపరిచిన అరుదైన సాలీడు జాతులు

శ్రీశైలం బయోడైవర్సిటీ కేంద్రం

జీవవైవిధ్యానికి సంబంధించిన పుస్తకాల లైబ్రరీ

సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీ

పెద్దదోర్నాల: ప్రకాశం జిల్లా సరిహద్దుకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ (సుండిపెంట) ముఖద్వారంలో గల ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్ కార్యాలయ సమీపంలో శ్రీశైలం బయోడైవర్సిటీ కేంద్రం ఉంది. శ్రీశైలం వెళ్లే ఏ బస్సులోనైనా ఇక్కడికి చేరుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల్లో విస్తరించి ఉన్న నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న వేలాది జీవరాశుల వైవిధ్యం గురించి ఈ జీవ వైవిధ్య కేంద్రం పరిశోధనలు నిర్వహిస్తోంది. నాగార్జునసాగర్, శ్రీశైలం పరిధిలో గల నల్లమల అభయారణ్యం సంరక్షణతో పాటు ప్రత్యేకించి పెద్దపులుల సంరక్షణ చేపట్టేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ టైగర్ ప్రాజెక్టు దేశంలో అతి పెద్దదైన పులుల సంరక్షణ కేంద్రంగా గుర్తింపు పొందింది. అభయారణ్యంలో ఉన్న జీవ వైవిధ్యాన్ని పరిశోధించేందుకు జీవ వైవిధ్య కేంద్రం ఎప్పటికప్పుడు కొత్త కొత్త ప్రయోగాలు చేపడుతోంది. ప్రజల అవసరాలకు, మానవ ప్రగతికి ఎంతో ఉపయోగపడుతోంది.

ఎతినో మెడికో బొటానిక్ స్టడీ ల్యాబ్...

ఆయుర్వేదాన్ని అభివృద్ధి పరిచే దిశగా ఆయుర్వేదానికి, అల్లోపతిలకు మొక్కలు ఎలా ఉపయోగపడతాయన్న అంశాలను సర్వే చేసి మానవాళికి ఉపయోగపడే విధంగా ఇక్కడ పరిశోధనలు జరుగుతున్నాయి.



భద్రపరిచిన అరుదైన సీతాకోకచిలుకలు

బయో ఇన్ఫర్మేటిక్...

పులుల గణాంకాలకు కావాల్సిన కొత్త పద్ధతులు ఎలా పాటించాలి.? వాటికి అవసరమైన శిక్షణ, ఇప్పుడు అవసరమైన కొత్త పద్ధతులను అన్వేషించడం, అడవులపై ఆధారపడిన వారికి జీవనోపాధి కల్పిస్తూ వారిని అడవులకు దూరంగా ఉంచడంలో బయోడైవర్సిటీ కేంద్రం ప్రముఖ పాత్ర పోషించింది.

ఎకో టెక్నాలజీ...

జీవరాశులు, మొక్కలు ఏ విధంగా మానవులకు, శాస్త్రవేత్తలకు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉపయోగపడుతున్నాయి..? వాటి ప్రధాన పాత్ర గురించి పరిశోధించడం జరుగుతుంది.

మాలిక్యులర్ బయోలజీల్యాబ్...

ఈ ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలతో జంతువులు, వన్యప్రాణులకు డీఎన్ఏ టెస్టులు చేపడతారు.

ఇవీ పరిశోధనలు...

శ్రీశైలం బయోడైవర్సిటీ కేంద్రంలో ఎన్నో అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు. ప్రధానంగా బయోసిస్టమ్యాటిక్, మాలిక్యులార్ బయాలజీ ల్యాబ్, బయోఇన్ఫర్ మ్యాటిక్స్, బయోమ్యాటిక్స్, ఇతనోమెడికో బొటానికల్ సైన్స్, కన్జర్వేషన్ బయోలజీ, ఎకో టెక్నాలజీపై పరిశోధనలు చేస్తున్నారు.

ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు



నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న వేలాది జీవరాశుల వైవిధ్యం గురించి ఈ జీవ వైవిధ్య కేంద్రం ఎప్పటికప్పుడు కొత్తరకం పరిశోధనలు నిర్వహిస్తోంది. ఎన్నో అంశాలపై పరిశోధనలు చేస్తోంది. పలు ల్యాబ్‌ల ద్వారా కొత్త రకం జీవులను పరిచయం చేస్తోంది.

– రమేష్, బయోడైవర్సిటీ సైంటిస్టు

ప్రపంచ వ్యాప్తంగా 18 కేంద్రాలు.. మన దేశంలో ఐదు కేంద్రాలు...

ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంత జీవ వైవిధ్యంపై ఆధారపడి ఉంటుంది. అటువంటి జీవ వైవిధ్య పరిశోధన కేంద్రాలు ప్రపంచ వ్యాప్తంగా 18 ఉండగా, మన దేశంలో ఐదు ఉన్నాయి. వాటిలో భాగంగా నల్లమల అటవీ ప్రాంతంలోని జీవ వైవిధ్యాన్ని పరిశోధించేందుకు నంద్యాల జిల్లాలోని శ్రీశైలం (సున్నిపెంట)లో బయోడైవర్సిటీ డివిజన్ కార్యాలయం, కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



పరిశోధనల కోసం భద్రపరిచిన సరీసృపాలు

బయోసిస్టమ్యాటిక్స్...

భూమి మీద ఎన్నో రకాల మొక్కలు, జంతువులు ఉన్నాయి. ఇవి ఏ వర్గానికి చెందినవి, వాటి వైవిధ్యం గురించి బయోసిస్టమ్యాటిక్స్ పరిశోధనలు జరుగుతున్నాయి. నల్లమలలోని ఈ జీవ వైవిధ్య కేంద్రం ఇది వరకు కనుగొనలేని జీవులను సైతం పరిచయం చేస్తోంది. ఇక్కడ వెన్నెముక లేని జీవులైన సీతాకోకచిలుక, మాత్‌లు, కీటకాలు, తూనీగలు, కందిరీగలు, తేనెటీగలు, బీటల్స్ ఎరాకిడ్స్ (స్పైడర్లు) మీద పరిశోధనలు చేస్తూ కొత్త రకం జీవులను ల్యాబ్ ద్వారా పరిచయం చేస్తున్నారు. అంతేగాకుండా వెన్నెముక జీవులైన చేపలు, ఉభయచరాలు, సరీసపాలు, పక్షులు, క్షీరదాలపై పరిశోధనలు చేస్తున్నారు.

సింగిల్ లార్జెస్ట్ పార్టీ.. వైఎస్సార్ సీపీ

- టీడీపీది రెండో స్థానమే
- తప్పుడు హామీలతో ప్రజలను నమ్మించిన టీడీపీ నేతలు
- వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో సింగిల్ లార్జెస్ట్ పార్టీగా వైఎస్సార్ సీపీ నిలిచిందని, టీడీపీ రెండో స్థానంలోనే ఉందని వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ తాజా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీకి ప్రజా బలం ఉండటం వలన, జగనన్నపై ఉన్న అభిమానంతో 40 శాతానికిపైబడి ప్రజలు ఓట్లు వేశారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కూటమిగా ఏర్పడి ఎన్నికల ప్రచారంలో తప్పుడు హామీలిచ్చి ప్రజలను నమ్మించినప్పటికీ.. టీడీపీని రాష్ట్రంలో ప్రజలు కేవలం రెండో స్థానంలోకి నెట్టివేశారని ఆయన అన్నారు. ఆ పార్టీ ఏదో ఒంటరిగా గెలిచినట్లు తమ స్వభావం ఏమిటో బహిర్గతం చేస్తోందని, ఇంకా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయకముందే రాష్ట్రంలో టీడీపీ వర్గీయులు అధికార అహంకారాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా అల్లర్లు సృష్టించి ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తున్నారని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని, ఈ చర్యలతో వారికే నష్టమని ఆయన అన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వంగా గత ఐదేళ్లు జగనన్న రాష్ట్రంలో పాలన అందించారని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి పేద ప్రజలకు మేలు చేశారని తాటిపర్తి చంద్రశేఖర్ వివరించారు.

ఎన్నికల్లో టీడీపీ విడుదల చేసిన మేనిఫెస్టోను సక్రమంగా అమలు చేయాలని, ప్రజలకు మేలు చేసేవిధంగా తాము కూడా ప్రభుత్వానికి సహకరిస్తామని తెలిపారు. యర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తన బలాన్ని చాటుకుందని, జగనన్నపై నమ్మకం ఉంచి ఓటు వేసినవారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా దాడులు, కావాలని రెచ్చకొట్టే ప్రయత్నాలను టీడీపీ వారు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ ఎన్నడూ గెలవనట్లుగా టీడీపీ మాత్రమే ఒంటరిగా గెలిచినట్లుగా వారు చేస్తున్న అకృత్యాలు, గొడవలు, వివాదాలు చూస్తుంటే.. వారు ఎటువంటి మనస్తత్వం కలిగి, ఎటువంటి అభివృద్ధి నమూనాతో అధికారంలోకి వచ్చారో గత 5 రోజుల్లోనే నిరూపించుకున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు మద్దతు తెలిపిన ప్రభుత్వం ప్రజలను కాపాడడానికి ప్రయత్నిస్తుందని, ఈ విధంగా రెచ్చకొట్టడం, విగ్రహాలు, శిలాఫలకాలు, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం, ఎటువంటి నియమ, నిబంధనలు పాటించకుండా తమ పేర్లు రాసుకోవడం, ఎలాంటి జీవోలు లేకుండా వ్యక్తిగతంగా అధికారాన్ని ఇంటి వస్తువుగా ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆయన ఖండించారు. ఇది మంచి పద్ధతి కాదని టీడీపీ, జనసేన శ్రేణులకు హితవు పలికారు. టీడీపీ వాళ్లు చేస్తున్న గొడవలకు తాము కూడా వైఎస్సార్ సీపీ శ్రేణులను ప్రోత్సహిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో గమనించాలన్నారు. తప్పును తప్పుగా మాట్లాడుకోలేని ప్రభుత్వం ప్రజలకు అవసరం లేదని, ప్రజలకు మంచి చేసి, మేలు చేయడానికే ప్రభుత్వాలు ఉన్నాయని, భయభ్రాంతులకు గురిచేయడానికి కాదని అన్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టే కార్యక్రమాలను మానుకోవాలని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని మంచి చేయడానికి, మీరు ఇచ్చినటువంటి మేనిఫెస్టోను అమలు పరచడానికి ఉపయోగించుకోవాలని ఆయన హితోపదేశం చేశారు. అందరం కలిసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని, ప్రజలను కాపాడుకుందామని, ప్రజలకు మంచి పాలన అందిద్దామని, ఆ వైపుగా అడుగులు వేద్దామని ఆయన అన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎస్.పోలిరెడ్డి, జి.రమణారెడ్డి, జెడ్పీటీసీ వాగ్యానాయక్, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఎస్.వెంకటరెడ్డి, మేడగం వెంకటరెడ్డి, ఏకుల మునలారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న వెంటే మేమంతా

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు వైఎస్సార్ సీపీ శ్రేణుల ఘన స్వాగతం



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం తాజా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు నియోజకవర్గ ప్రజలు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన.. తొలిసారిగా నియోజకవర్గంలో అడుగుపెట్టారు. కౌంటింగ్ అనంతరం ఎన్నికల కోడ్ కొనసాగుతుండటం, 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఆయన నియోజకవర్గంలోకి రాలేకపోయారు. నిబంధనలు సడలించడం వలన ఎమ్మెల్యే హోదాలో యర్రగొండపాలెం చేరిన ఆయనకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శాలువాలు, పూలమాలలతో సన్మానించి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా వైఎస్సార్, మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతీరావుపూలే విగ్రహాలకు ఎమ్మెల్యే చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి తన వాహనంలో కొలుకుల రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకున్నారు. అక్కడ కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడారు. జగనన్న నాయకత్వంలో మనమంతా కలిసి నడవాలని, ప్రజల సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎల్లవేళలా తాను నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. గ్రామాల్లో టీడీపీ వర్గీయులు రెచ్చగొట్టాలని చూస్తారని, అందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, గంటా రమణారెడ్డి, పోలిరెడ్డి, పుల్లలచెరువు మండల జెడ్పీటీసీ వాగ్యా నాయక్, ఎన్నికల చీఫ్ ఏజెంట్ ఎస్.వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, కె.వెంకటేశ్వరరెడ్డి, మహిళా సంఘం నాయకురాలు పల్లె సరళ కుమారి, వివిధ విభాగాల నాయకులు దుద్యాల వెంకటరెడ్డి, రోషిరెడ్డి, బాదర్‌రెడ్డి, బి.బాలచెన్నయ్య, గాలి శ్రీనివాసరెడ్డి, డి.కాశింపీరా, డి.రసూల్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తాటిపర్తికి స్వాగతం పలికేందుకు భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

జాతీయ స్థాయి సెమినార్‌కి తాళ్లూరు ఏవో



ప్రసాదరావు

తాళ్లూరు (ముండ్లమూరు): వ్యవసాయంలో మేలైన పద్ధతులపై జాతీయ స్థాయి శిక్షణ-సెమినార్‌కు తాళ్లూరు మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు ఎంపికయ్యారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎస్‌ఐఆర్‌డీలో నిర్వహించే జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఆ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సెమినార్‌లో మేలైన వ్యవసాయ పద్ధతులు, స్కోప్ సర్టిఫికెట్ పొందే విధానంపై శిక్షణ ఉంటుందని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. వ్యవసాయంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం, మేలైన పద్ధతులు పాటించి ప్రపంచంలోని ఏ దేశానికైనా మన పంట ఉత్పత్తులు అమ్ముకునేందుకు కావాల్సిన సర్టిఫికెట్ పొందడం, విధివిధానాలు అమలుపరిచేందుకు జాతీయ స్థాయి సెమినార్ ఏర్పాటు చేశారు. పొలంబడి కార్యక్రమానికి మేలైన సాగు పద్ధతులు జోడించి కఠిన పరీక్షలలో పంట ఉత్పత్తులు పాసయ్యేలా రైతులను వ్యవసాయాధికారి ప్రసాదరావు తీర్చిదిద్దారు. విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ద్వారా రాష్ట్రంలో మొదటిసారి నువ్వుల పంటకు స్కోప్ సర్టిఫికెట్ వచ్చేలా కృషి చేశారు. దాంతో పాటు 140 దేశాలలో ఎక్కడైనా పంటను అమ్ముకునేందుకు అవకాశం కలిగేలా కృషి చేశారు. అందుకుగానూ తనను జాతీయ స్థాయి శిక్షణ-సెమినార్‌కు ఎంపిక చేసినట్లు ప్రసాదరావు తెలిపారు.

జిల్లాలో పలు చోట్ల వర్షాలు

- 426.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని 38 మండలాలకుగానూ 25 మండలాల్లో శనివారం 426.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జరుగుమల్లి మండలంలో 58.6 మిల్లీమీటర్లు, పొన్నలూరు 50.2, చీమకుర్తి 40, మద్దిపాడు 32.8, ఎస్.కొండ 20.8, మర్రిపూడి 20.4, పామూరు 19.8, పీసీ పల్లి 18.8, ఒంగోలు, ఒంగోలు అర్బన్‌లో 16.8 మి.మీ చొప్పున, కొండపి 15.8, కనిగిరి 14.2, ఎన్‌జీ పాడు 13.6, ఎస్ఎన్ పాడు 13.4, హెచ్ఎం పాడు 13.2, పొదిలి 8.6, వెలిగండ్ల 6.2, దర్శి 5.2, ముండ్లమూరు, సీఎస్ పురంలో 4.2 మి.మీ చొప్పున, కొత్తపట్నం 3.8, కె.కె.మిట్ట 3, తాళ్లూరు, గిద్దలూరులో 2.2 మి.మీ చొప్పున, కొమరోలులో 1.2 మిల్లీమీటర్లు కలిపి మొత్తం 426.4 మిల్లీమీటర్లు, సరాసరిన 10.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టు



బెల్టులు, ధ్రువీకరణ పత్రాలు అందుకున్న కరాటే విద్యార్థులు

ఒంగోలు: కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ టెస్టును స్థానిక హైదరీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. కొత్తపట్నం, ఒంగోలు ప్రాంతాల నుంచి 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. గ్రేడింగ్ టెస్టులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు, ధ్రువీకరణ పత్రాలను అతిథులు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ ఆత్మ రక్షణకు, మనోధైర్యానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సిద్దార్థ కరాటే అసోసియేషన్ కార్యదర్శి నల్లూరి మోహనరావు, స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ అధ్యక్షుడు గుండవరపు రాఘవ, సిద్దార్థ కరాటే అసోసియేషన్ ఏపీ, తెలంగాణ అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు, హైదరాబాద్ స్కూల్ కరస్పాండెంట్ జగదీష్, సూర్య స్కూల్స్ అధినేత వెంకటరామిరెడ్డి, కరాటే మాస్టర్లు వెంకటేశ్వర్లు, సునీల్, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



పఠనం ప్రాముఖ్యతను వివరిస్తున్న జిల్లా ఉప గ్రంథపాలకురాలు కోటేశ్వరి

ఒంగోలు సెంట్రల్: పుస్తక పఠనంతో చిన్నారుల్లో మరింత విజ్ఞాన శక్తి పెరుగుతుందని జిల్లా ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులతో పుస్తక పఠం చేయించి, దేశ నాయకుల జీవిత చరిత్రలను వివరించి కథలను చదివించారు. పొడుపు కథలు చెప్పి ప్రశ్నలు అడిగారు. తెలుగు, ఇంగ్లిష్ పదాల డిక్టేషన్ చెప్పి రాయించారు. బాషలపై పట్టు పెంచుకోవాల్సిన ఆవశ్యకత, చేతిరాత ప్రాముఖ్యతను వివరించారు. గ్రంథాలయ సిబ్బంది అనిల్, ఎం శివ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



రాజీనామా లేఖను చూపుతున్న కొండయ్య

మార్కాపురం: ఏపీ స్టేట్ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు మార్కాపురం పట్టణానికి చెందిన నల్లబోతుల కొండయ్య తెలిపారు. ఆదివారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ తన రాజీనామా పత్రాన్ని బీసీ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి పంపుతున్నట్లు తెలిపారు.

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య

పొన్నలూరు: ఉరేసుకొని బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పొన్నలూరులో ఆదివారం జరిగింది. పోలీసులు, బంధువులు వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజా కుటుంబ సభ్యులు కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం పొన్నలూరు వచ్చి అద్దెకు రూమ్ తీసుకొని హోటల్ నడుపుతున్నాడు. ఈక్రమంలో ఆదివారం రోజు మాదిరిగానే హోటల్ తెరిచాడు. ఉదయం 11 గంటల సమయంలో తన చిన్న కుమార్తె యామిని(17) టీ పెట్టమని చెప్పాడు. దీంతో ఇంట్లోకి వెళ్లిన యామిని ఏమైందో ఏమో గానీ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లోకి వెళ్లిన యామిని ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో రాజా ఇంట్లోకి వెళ్లి చూడటంతో అప్పటికే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యామిని మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు పంపించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎంవీ రాజేష్ తెలిపారు.

బంగినపల్లెకి భలే గిరాకీ...!

- హైదరాబాద్ నుంచి భారీగా కొనుగోలుదారులు
- టన్ను రూ.లక్ష పైనే
- కవరు కట్టిన కాయలు రూ.లక్షపైనే



బంగినపల్లెరకం మామిడి ప్యాకింగ్ చేస్తున్న కూలీలు



కవరు కట్టిన బంగినపల్లె రకం



మంచి నాణ్యత కలిగి ఉన్న కవర్లు కట్టిన కాయలు

ఉలవపాడు: ప్రపంచంలోనే పేరుగాంచిన ఉలవపాడు బంగినపల్లెకు భారీగా డిమాండ్ ఏర్పడింది. గత నాలుగు రోజుల నుంచి హైదరాబాద్ నుంచి భారీగా కొనుగోలుదారులు ఉలవపాడు ప్రాంతానికి వస్తున్నారు. వారు బంగినపల్లె కాయల కోసం రైతులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది మామిడి కాయల దిగుబడి తక్కువగా ఉండడంతో కాయలు బాగా తక్కువగా ఉన్నాయి, ఈ పరిస్థితుల్లో కొనుగోలుదారులు ఎక్కువ ధర చెల్లించైనా కొనుగోలు చేస్తున్నారు. దీంతో వారం రోజుల క్రితం రూ.40 వేల లోపు ఉన్న టన్ను బంగినపల్లె ఇప్పుడు టన్ను రూ.60 వేలకు చేరింది. ఫ్రూట్ కవర్లు కట్టిన కాయలైతే రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతున్నాయి. గత వారం రోజుల నుంచి బంగినపల్లె కాయలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. కానీ కొనుగోలుదారులకు పూర్తి స్థాయిలో కాయలు అందించే పరిస్థితి ఇప్పుడు రైతుల వద్ద లేదు. గతంలో దళారులు పంపించేవారు కానీ ఇప్పుడు హైదరాబాద్ నుండి కొనుగోలుదారులే వచ్చి కాయల కోసం తోటల వెంబడి తిరుగుతున్న పరిస్థితి నెలకొంది.

ధరలతో రైతుల్లో ఆనందం

ప్రస్తుతం బంగినపల్లె కాయలు మంచి ధర పలుకుతున్నాయి. డిమాండ్ పెరగడంతో కాయల రేట్లు వారంలో భారీగా పెరిగాయి. ప్రస్తుతం హైదరాబాద్‌కు బంగినపల్లె రకంను నాణ్యతను బట్టి టన్ను రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఎగుమతులు చేస్తున్నారు. కాయలను తోటలోనే కోసి ప్యాకింగ్ చేసి లారీలు, ట్రక్కుల్లో తరలిస్తున్నారు. కవర్లు కట్టిన కాయలను టన్ను రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు ఎగుమతులు జరుగుతున్నాయి. బయట మార్కెట్ లో సైతం పల్లెరకం కేజీ రూ.80 నుంచి రూ.100 వరకు పలుకుతోంది. కవర్లు కట్టిన కాయలను బయట మార్కెట్ లో కేజీ 150 పైనే అమ్ముతున్నారు.

కవర్లు కట్టిన కాయలకు మంచి డిమాండ్

మామిడిలో పండుఈగ సోకకుండా ఫ్రూట్ కవర్లు కట్టిన మామిడి కాయలకు ప్రస్తుతం బాగా డిమాండ్ ఉంది. కవర్లు కట్టిన కాయలలో చిన్న మచ్చ కూడా ఉండదు. కాయలోపల పురుగుసోకే అవకాశం ఉండదు. నాణ్యత బాగుంటుంది. కాబట్టి ఈ కాయలకు అధికంగా డిమాండ్‌ఉంది. బంగినపల్లె రకానికి చెందిన ఈ కాయలను తీసుకువెళ్లేందుకు కొనుగోలుదారులు పోటీపడుతున్నారు. గత వారం రోజుల్లో హైదరాబాద్ వ్యాపారుల కారణంగా ఉలవపాడు ప్రాంతంలోబంగినపల్లెమామిడికి మంచి డిమాండ్ పెరిగింది.

గమనించండి!

- గనుల్లో కార్మికులకు భద్రత కరువు
- పొట్ట కూటి కోసం ప్రాణాలు పణంగా పెట్టాల్సిందే..
- నాలుగేళ్లలో ఆరుమంది మృతి



పలకల గనుల్లో రాయిని బయటకు తీస్తున్న కార్మికులు

మార్కాపురం: పలకల గనుల్లో కార్మికుల భద్రత గాలిలో దీపంగా మారింది. భూగర్భ గనుల శాఖ, కార్మిక శాఖాధికారుల తనిఖీలు లేకపోవటంతో కార్మికుల జీవితాలకు భద్రత, భరోసా లేకుండా పోతోంది. ఈనెల 1న మార్కాపురం మండలం గోగులదిన్నెకు చెందిన బూదాల వెంకటమ్మ బుడ్డపల్లి గ్రామ సమీపంలోని పలకల క్వారీలో ప్రమాదవశాత్తు కాలుజారిపడి మృతి చెందింది. నాలుగేళ్ల క్రితం ఈర్ల గురవయ్య, గోగు చిన్న గురవయ్య మృతి చెందారు. గత ఏడాది రాయవరం పలకల గనుల్లో పనిచేస్తూ మహిళా కూలీ మృతి చెందింది. రెండేళ్లక్రితం కూడా రాయవరం పలకల గనుల్లో రాళ్లుతీస్తూ కూలీ మృతి చెందాడు. ఇలా ప్రతి ఏటా క్వారీల్లో పనిచేస్తూ కార్మికులు ప్రాణాలొదులుతున్నారు. పలకల గనుల్లో తరచుగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నప్పటికీ పెద్దల జోక్యంతో పోలీస్ స్టేషన్ వరకు కేసులు రావడం లేదు. మార్కాపురం, తర్లుపాడు, దొనకొండ మండలాల్లోని సుమారు 15 కిలోమీటర్లు మేర పలకల గనులు విస్తరించి ఉన్నాయి. తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు, మేకలవారిపల్లె, చెన్నారెడ్డిపల్లె, తుమ్మల చెరువు, మార్కాపురం మండలంలోని నాయుడుపల్లె, రాయవరం, యాచవరం, మొద్దులపల్లి, కందివారిపల్లె, గజ్జలకొండ, దొనకొండ, మండలంలోని మంగినిపూడి, మల్లంపేట తదితర గ్రామాల్లో పలకల గనులు విస్తరించి ఉన్నాయి. ప్రతిరోజూ సుమారు 400 నుంచి 500 మంది కార్మికులు గనుల్లో పని చేస్తుంటారు. మార్కాపురం పలకల గనుల్లో విజయగోల్డ్, మల్టీ కలర్, బ్లాక్, ఆటమ్, తదితర డిజైన్ స్లేట్స్ తీస్తుంటారు. ఒక్కొక్క గని నుంచి నెలకు 10 నుంచి 15 టన్నుల వరకు ముడిరాయిని గనుల్లో నుంచి బయటకు తీస్తారు. వీటిని ఫ్యాక్టరీలకు చేర్చి వివిధ సైజుల్లో కోత కోసి ప్యాక్ చేసి విక్రయిస్తారు. మార్కాపురం ప్రాంతంలో సుమారు 30 క్వారీలుంటాయి. సుమారు 100 అడుగుల లోతులో కార్మికులు రాయిని బయటకు తీస్తారు. అక్కడి నుంచి క్రేన్ల ద్వారా లారీల్లోనికి ఎత్తి ఫ్యాక్టరీల్లోనికి చేరుస్తారు. ఈ క్రమంలోనే రాళ్లుమీదపడి కూలీలు మృతి చెందుతున్నారు.

రక్షణ కోసం ఇలా చేయాలి..

పలకల గనుల్లో, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు కనీస భద్రత ఏర్పాట్లు చూసుకోవాలి. తలకు హెల్మెట్ పెట్టుకోవాలి. చేతులకు గ్లౌజులు తొడుక్కోవాలి. ఏ మాత్రం ఎమరపాటుగా ఉన్న ప్రాణాలు గాలిలో కలిసి పోతాయి. ప్రతి కార్మికునికి వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యం ఉండాలి. యాజమాన్యాలు కార్మిక శాఖాధికారుల వద్ద తాము పనిచేస్తున్న కార్మికుల వివరాలను నమోదు చేయించాలి. కానీ మార్కాపురంలో ఇలా జరగడం లేదు. దీంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రమాదం జరిగినా ఇన్సూరెన్స్ సౌకర్యం, ఉచిత వైద్య సదుపాయాలు పొందలేక గనుల యజమానుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. గనుల శాఖాధికారులు భద్రత వారోత్సవాలను నిర్వహించి కార్మికులకు అవగాహన కల్పించడం లేదు. తమ టార్గెట్ల కోసం అప్పుడప్పుడు గనుల దగ్గరకు వెళ్లి పలుగు, పార వేసి నామ మాత్రపు కేసులు రాసి పెనాల్టీ విధించి చేతులు దులుపుకుంటున్నారు. దీని వలన ప్రభుత్వానికి వచ్చే రాయితీ కూడ తగ్గిపోతుంది.

సైన్స్ పాత్ర ఎంతో కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

ఒంగోలు సెంట్రల్: ప్రజాస్వామ్యంలో సైన్స్ పాత్ర ఎంతో కీలకమని, తాత్విక భావనగా సైన్స్‌ను ప్రజల వద్దకు తీసుకు వెళ్లాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ఒంగోలు ఎల్‌బీజీ భవన్‌లో ఆదివారం జన విజ్ఞాన వేదిక 4 జిల్లాల జోనల్ స్థాయి వర్క్ షాప్ జిల్లా అధ్యక్షుడు మండ్లా శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ విశ్వం ఆవిర్భావం , మనిషి పుట్టుక, సమాజ నిర్మాణం వంటి వాటిపై సమాజంలో అవగాహన కలిగించేందుకు కృషి చేయాలని జేవీవీ కార్యకర్తలను కోరారు. జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ సైన్సును ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. జిల్లా గౌరవ సలహాదారుడు ఏవీ పుల్లారావు మాట్లాడుతూ పాలకులు ఎవరు గెలిచినా పదే పదే ఓడిపోతున్నది ప్రజలే అని అన్నారు. సైన్స్ దృక్పథం లేని పాలన అభివృద్ధిని సాధించలేదని తెలిపారు. రాజ్యాంగంలోని 51ఎహెచ్ ప్రకారం దేశంలో శాస్త్రీయ దృక్పథాన్ని ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించే ప్రధాన బాధ్యత ప్రభుత్వాలదేనని, ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ జాతీయ కమిటీ సభ్యులు డాక్టర్ కాలేషా, సీహెచ్ జయప్రకాశ్, దార్ల బుజ్జిబాబు, వివిధ జిల్లాల జేవీవీ నాయకులు వి. మాలకొండారెడ్డి, కె.సుబ్రహ్మణ్యం, యు భాస్కర్, బి.తిరుపతయ్య, కె.క్రిష్టారెడ్డి, మాదాల రాము, తంగా శ్రీనివాస్, షేక్ బషీరున్నీషా బేగం, ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలు ప్రతినిధులు పాల్గొన్నారు.











స్విమ్మింగ్ పూల్. సమ్మర్ కూల్..

మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి స్విమ్మింగ్ ఎంతో దోహదపడుతుంది. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ పలువురు చిన్నారులు స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. ఒంగోలు నగరంలోని రాంనగర్ 14వ లైన్‌లోని టార్గెట్ థ్రిల్ బేస్ క్యాంప్‌లో స్విమ్మింగ్ చేస్తూ హాట్ సమ్మర్‌లో కూల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు.

– సాక్షి, ఒంగోలు

అధికార బలంతో పొలంలోకి చొరబడి.

- 4.40 ఎకరాల పట్టా భూమిలో అక్రమంగా పాకలు
- అడ్డుకోబోతే దాడికి ప్రయత్నం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



స్థలంలో వేసిన పాకలు



జేసీబీ సాయంతో స్థలం చదును చేస్తున్న దృశ్యం

ఒంగోలు: అధికార బలంతో పొలంలోకి చొరబడి కబ్జా చేశారని పెట్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కల్లూరి హరిబాబు వాపోయాడు. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన కల్లూరి హరిబాబు మరో ముగ్గురు అన్నదమ్ములు కలిసి 2010లో సర్వే నంబర్ 450లో 4.40 ఎకరాల భూమిని కొనుగోలు చేసి సింగరాయకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అప్పటి నుంచి ఆ భూమి వారి స్వాధీనంలోనే ఉంది. అయితే ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత గ్రామ ఎస్సీ కాలనీవాసులు పట్టా భూమిని కబ్జా చేసి పాకలు వేశారని వాపోయారు. అడ్డుకోబోతే దాడి చేసేందుకు వస్తున్నారని కొండపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారులు చర్యలు తీసుకొని భూమికి మాకు స్వాధీనం చేయాలని కోరారు.